సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 26 । ఆగస్టు । 2024



రైతుకు ఆదాయం.. ప్రజలకు ఆరోగ్యం

సేంద్రియ పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో సాగు చేసే కొర్ర పంట రైతుకు ఆదాయం తెస్తుండగా.. వాటిని తిన్న ప్రజలకు ఆరోగ్యం లభిస్తోంది.

8లో



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/22.9°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. సాయంత్రం తర్వాత .ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కరెంటు కోతతో ఉక్కిరిబిక్కిరి



పుట్టపర్తి టౌన్: కరెంటు కోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మరమ్మత్తుల పేరిట అధికారులు కోతలు విధిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, గోరంట్ల మండలాల పరిధిలో ప్రధాన విద్యుత్ తీగలు రిపేరీ కారణంగా ఉయదం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేశారు. విడతల వారీగా కాకుండా ఏకంగా 11 గంటలపాటు కరెంటు లేకపోయే సరికి ఇళ్లలోని వృద్ధులు, చిన్నపిల్లలు, వర్క్ ఫ్రం హోమ్ చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, పట్టణాల్లోని చిన్న పరిశ్రమలు, లాడ్జీల నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. పగలు ఎండల కారణంగా ఉక్కపోత అధికంగా ఉండటంతో చాలా మంది విలవిలలాడారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులు కోతలు ఎక్కువ సమయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: మహిళలు అన్ని రంగాల్లోనూ ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ చేతన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ మహారాష్ట్రలోని జెల్గాన్ నుంచి ప్రసంగించారు. ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీపై మహిళలు, అధికారులు వీక్షించారు. ఇందులో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎంలు రామమోహన్, రామిరెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిద్ద గంగమ్మ, ఏపీఎం వెంకటప్ప, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రతి మహిళనూ లక్షాధికారిని చేయడమే లఖ్‌పతి దీదీ లక్ష్యమన్నారు. జిల్లాలో 2,676 మందిని లఖ్‌పతి దీదీలుగా గుర్తించి స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.22.13 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళలు కేవలం తమ ఆదాయం కోసం కాకుండా శాశ్వత జీవనోపాధి పద్ధతులను ఎంచుకొని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ ఐదేళ్లలో జిల్లాలో 9,757 మందిని 'లఖ్‌పతి దీదీ'లను చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం మెగా చెక్కుతో పాటు పుట్టపర్తి, లేపాక్షి మండలాల స్వయం సహాయక సంఘాలకు ఒక్కో మండలానికి రూ.10 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు.

నృసింహుని సేవలో హైకోర్టు జడ్జి



పెన్నహోబిలంలో హైకోర్టు జడ్జి సుజాతకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని ఏపీ హైకోర్టు జడ్జి సుజాత ఆదివారం సందర్శించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథాచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు జడ్జి శ్రీవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈఓ విజయ్ కుమార్ తీర్థప్రసాదాలు అందించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు.



డాక్టర్లకే రక్షణ లేకపోతే ఎలా?

ఆస్పత్రులకు వచ్చే రోగులను కుటుంబ సభ్యులుగా భావించి వైద్యం అందిస్తాం. ప్రాణం పోసే డాక్టర్లకు పని ప్రదేశాల్లో రక్షణ చాలా ముఖ్యం. కోల్‌కతాలో ట్రెయినీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన బాధాకరం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. డాక్టర్లు, సిబ్బంది భద్రతకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ సి.అశ్రిత, తలుపుల




సీసీ కెమెరాలు తప్పనిసరి చేయాలి

ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది భద్రత కోసం సీసీ కెమెరాలు తప్పనిసరి చేయాలి. రాత్రిపూట పేషెంట్లు ఆస్పత్రికి వచ్చినపుడు వారికి ఒక అటెండర్ ఉంటే సరిపోతుంది. అంతకు మించి రోగి బంధువులు వస్తే గందరగోళంగా మారుతుంది. అప్పుడు సరైన వైద్యం అందించే పరిస్థితి ఉండదు. స్వేచ్ఛగా చికిత్స చేసేలా వైద్యులను ప్రశాంతంగా ఉండనివ్వాలి.

– డాక్టర్ సోనియా, గైనకాలజిస్టు, ధర్మవరం



సీజనల్ వ్యాధుల పంజా



ఎడతెరిపి లేని వానలు.. ఎక్కడపడితే అక్కడే నిలుస్తున్న వర్షపు నీరు.. అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ.. పట్టించుకోని పాలకులు.. నివాస ప్రాంతాల్లో చెత్తకుప్పల కారణంగా సీజనల్ వ్యాధులు పంజా విప్పాయి. అతిసారం ఆందోళనకు గురి చేస్తోంది. డెంగీ డేంజర్‌గా మారింది. మలేరియా చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అతిసారం, డెంగీ, మలేరియా, చికున్‌గన్యా తదితర జ్వరాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజుకు నగటున రెండు వేల మందికి పైగా జ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు. కేవలం హిందూపురం జిల్లా ఆస్పత్రిలోనే రోజుకు 800 మంది పైగా ఓపీ ఉంటోంది. అందులో 200 మంది పైగా అడ్మిట్ అవుతున్నారు.

- ప్రబలుతున్న డెంగీ, అతిసారం
- మడకశిరలో ప్రమాదకర పరిస్థితులు
- ధర్మవరంలో డెంగీ జ్వరాల విజృంభణ
- హిందూపురం, కదిరి ఆస్పత్రులు కిటకిట
- పెనుకొండలో రోగులతో నిండిన ఆస్పత్రి
- రోడ్లపై ఎక్కపడితే అక్కడ చెత్త
- నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా అతిసారం అపాయకరంగా మారింది. రెండు వారాల వ్యవధిలోనే పదుల సంఖ్యలో మరణాలు నమోదయ్యాయి. అయితే మృతులందరూ వేర్వేరు జబ్బుల కారణాలతో మృతి చెందినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో నిజానిజాలు పక్కనబెడితే జ్వరాల దెబ్బకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఏ ఆస్పత్రికి వెళ్తే.. ఎలాంటి చికిత్స చేసి.. ఏం జబ్బు నిర్ధరణ చేస్తారోనని భయపడుతున్నారు.

ప్రమాదకరంగా టైఫాయిడ్

జ్వరాల్లో ప్రమాదకరమైనది టైఫాయిడ్ సీజన్ ఆధారంగా ప్రబలుతున్న జ్వరాల్లో టైఫాయిడ్ కేసులు అధికంగా తేలుతున్నాయి. ప్రతి ఆస్పత్రిలో టైఫాయిడ్ కేసులు నిర్ధారణ అవుతున్నాయి. పలు జబ్బులతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు అనుగుణంగా ప్రభుత్వాస్పత్రుల్లో సకాలంలో చికిత్స అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ డాక్టర్లు సరిగా డ్యూటీలో ఉండకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు.

డేంజర్‌గా డెంగీ..

జ్వరం రాగానే డెంగీ వచ్చినట్లు జనాలు భయపడుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం ఆలస్యం అవుతుందని.. ప్రైవేటు డాక్టర్లను ఆశ్రయిస్తే డెంగీ పేరు చెబుతూ కాసులు దోచేస్తున్నారు. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో జ్వరం రాగానే.. ఏ ఆస్పత్రికి వెళ్తే ఎలాంటి చికిత్స చేస్తారోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వాస్పత్రుల్లో చేరుతున్నారు.

ఎటు చూసినా చెత్త.. వర్షపు నీరు

జిల్లా అంతటా పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా మారింది. ఫలితంగా పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, వర్షపు నీటికుంటలు దర్శనమిస్తున్నాయి. జనావాస ప్రాంతాల్లో వర్షపు నీటిలో దోమలు ఆవాసాలు చేసుకుని పలు రోగాలకు కారణమవుతున్నాయి.



ధర్మవరంలో అపరిశుభ్రత

జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు ..

2,631	అతిసారం కేసులు
152	టైఫాయిడ్
60	డెంగీ
04	మలేరియా
02	చికున్‌గన్యా

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



జ్వరం రాగానే ప్రమాదకరం కాదు. అయితే వెంటనే స్థానిక ఆస్పత్రుల్లో చేరితే జ్వరం తీవ్రత, ఎలాంటి జ్వరం వచ్చిందనేది నిర్ధారణ చేస్తారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం చేయించుకోవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో జ్వరాలు సహజమే. అయితే ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. రోగాలు అదుపులోనే ఉన్నాయి. ఎలాంటి ఆందోళనా చెందాల్సిన పని లేదు.

– డాక్టర్ మంజువాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ



పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



కదిరి ఆస్పత్రిలో క్యూ కట్టిన రోగులు



హిందూపురం ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న ఓ వార్డు

జాంబియాకు 'ప్రకృతి' వ్యవసాయ బృందం

- సీటీఐఓ లక్ష్మానాయక్ నేతృత్వంలో ఆరుగురు పయనం



జాంబియాకు పయనమైన లక్ష్మానాయక్ బృందం

అనంతపురం అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయాన్ని ఖండాంతరాలు దాటించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు, రైతుల బృందం జాంబియా దేశానికి వెళుతున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ విభాగం చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ (సీటీఐఓ) వి.లక్ష్మానాయక్ నేతృత్వంలోని ఆరుగురితో కూడిన బృందం 15 రోజుల పర్యటన నేపథ్యంలో ఆదివారం ఇక్కడి నుంచి జాంబియా దేశానికి బయలుదేరింది. ఈ సందర్భంగా 'సాక్షి'తో లక్ష్మానాయక్ మాట్లాడుతూ ఆఫ్రికాలోని జాంబియా పేద దేశమన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించి రైతులకు సహజ పద్ధతులు అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, తక్కువ భూమిలో వివిధ రకాల పంటల సాగు అంశాల గురించి అవగాహన కల్పించి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పర్యటన జరుగుతోందన్నారు. గత జూన్‌లో జాంబియా బృందం రాష్ట్రం, జిల్లాలో పర్యటించి ఇక్కడ రైతులు అవలంబించిన ప్రకృతి సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు, మంచి దిగుబడులతో కూడిన ఫలితాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జాంబియా ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఆ దేశంలో కూడా ప్రకృతి విస్తరణకు తమ వంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. తనతో పాటు లైజనింగ్ ఆఫీసర్ షేక్ ఇర్ఫాన్, చాంపియన్ ఫార్మర్స్ కింద కుమ్మర రవిచంద్ర, వాల్మీకి శివశంకర్, రుద్రపాటి సుకన్య, పుట్టగోసుల సుధాకర్ తదితరులు జాంబియాకు వెళుతున్నట్లు తెలిపారు.

నేటి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరగాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నా ట్రాక్టర్లనే పట్టుకుంటారారా?



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

- పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకుడి హల్‌చల్

రాప్తాడురూరల్: 'ఎంత ధైర్యం నీకు... నా ట్రాక్టర్లనే పట్టుకుంటావా?. నేనెవరునుకుంటున్నావ్? మా పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంత కష్టపడ్డానో నీకేం తెలుసు. ఎవరితో ఫోన్ చేయించాలో చెప్పు... ఎలా వదలిపెట్టరో చూస్తా' అంటూ ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలానికి చెందిన టీడీపీ చోటా నేత హల్‌చల్ చేశాడు. వివరాలు... బత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత కేశవ... చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా అనంతపురం నగరానికి తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అనంతపురం రూరల్ మండలం కృష్ణమరెడ్డిపల్లి క్రాస్‌లో ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ వన్నూరురెడ్డి, కానిస్టేబుళ్లు వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న కేశవ ఏకంగా స్టేషన్‌కు చేరుకుని సిబ్బందిపై చిందులు వేశారు.

అన్న చెప్పాడని.. అడ్డగోలు దోపిడీ

చెలరేగిపోతున్న మట్టి మాఫియా

- కదిరి మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు
- ప్రైవేట్ వెంచర్లకు టిప్పర్ల ద్వారా తరలింపు
- అడ్డుకట్ట వేయలేకపోతున్న అధికారులు



కదిరి మండలం పర్తిగడ్డ సమీపంలో మట్టి తవ్వి టిప్పరులో వేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: సంపాదనే ధ్యేయంగా మట్టి మాఫియా చెలరేగిపోతోంది. కదిరి మండల పరిధిలోని పర్తిగడ్డ, తుమ్మలరోడ్డు, పులివెందుల రోడ్డు తదితర ప్రాంతాల్లోని కొండలు, గుట్టల్ని కొల్లగొట్టేస్తోంది. అందినకాడికి దోచేస్తోంది. మట్టి తరలించే చోట ఎవరైనా అడ్డుకుంటే అన్న (ఎమ్మెల్యే) చెప్పాడని, లేదంటే మరో టీడీపీ నాయకుడు పేరు చెప్పి భయపెడుతోంది. ఇదివరకే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తన పేరు వాడుకుని అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించినా బేఖాతరు చేస్తోంది. రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా తమకు అనుమతి ఇచ్చారని బాహాటంగా మాఫియా సభ్యులు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల తమది పట్టా భూమని, చదును చేసుకుంటున్నామని చెబుతూ అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. రోజూ ఒక్కో మాఫియా సభ్యుడు 100కు పైగా టిప్పర్ల మట్టిని కదిరి పట్టణంలోని ప్రైవేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. టిప్పరు మట్టి రూ.2 వేల దాకా విక్రయిస్తున్నారు. ఈ లెక్కన వంద టిప్పర్లకు రూ.2 లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు.

మారిపోతున్న భౌగోళిక స్వరూపం

అక్రమార్కులు కొండలు, గుట్టల్ని కొల్లగొడుతుంటే కదిరి మండల భౌగోళిక స్వరూపమే మారిపోతోంది. ఆ మట్టిని వెంచర్లకు తరలించి ఎత్తు పెంచేస్తున్నారు. దీంతో భారీ వర్షాలు కురిసినపుడు వర్షపు నీరు, మురుగు నీరు ఎలా పడితే అలా ప్రవహిస్తూ జనావాసాలను ముంచెత్తుతున్నాయి.

తెలివిగా మట్టి తరలింపు

ప్రభుత్వ కార్యాలయాల పనిరోజుల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల లోపు మట్టి తరలిస్తున్నారు. అధికారులు విధుల్లోకి వచ్చేలోపు పని కానిచ్చేస్తున్నారు. తిరిగి సాయంత్రం కార్యాలయ పనివేళలు ముగిశాక మొదలు పెట్టి రాత్రి వరకు యథేచ్ఛగా మట్టి సరఫరా చేసుకుంటున్నారు. సెలవు రోజుల్లో అయితే అధికారులు ఉండరని నిరాటంకంగా మట్టి తోడేస్తున్నారు. నిత్యం అధికలోడుతో టిప్పర్లు వెళ్తుండడంతో రోడ్డు పాడవుతోందని గాండ్లపెంట మండలం వీరన్నగట్టుపల్లి చెందిన గ్రామస్తులు ఇటీవల ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.




టిప్పరులో తరలుతున్న మట్టి

చర్యలు తీసుకుంటాం

కొండలు, గుట్టల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. మా సిబ్బందిని పంపించి తనిఖీ చేయిస్తాం. అనధికారికంగా మట్టి తవ్వి.. తరలిస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తాం. అక్రమార్కులు ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదు. మా సిబ్బందిని అప్రమత్తం చేసి.. నిఘా పెట్టిస్తాం.

– మురళీకృష్ణ, తహసీల్దార్





సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

భక్త కోటిని మురిపించిన 'ప్రేమాంజలి'

ప్రశాంతి నిలయం: సత్యసాయిని స్మరిస్తూ ప్రేమాంజలి పేరుతో నిర్వహించిన సంగీత కచేరీ భక్తకోటిని మురిపించింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన విశాఖపట్నం జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయి ప్రేమ తత్వాన్ని, సేవా నిరతిని కొనియాడుతూ చక్కటి భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం పర్తియాత్రలో భాగంగా విచ్చేసిన రెండు వేల మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

అతిసారం ప్రబలకుండా ప్రత్యేక చర్యలు : డీఎంహెచ్‌ఓ

మడకశిర: జిల్లాలో అతిసారం ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. ఆదివారం మడకశిరలో ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో అతిసారం పూర్తిస్థాయిలో అదుపులో ఉందన్నారు. ఆదివారం ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. వేడి ఆహారంతో పాటు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. మడకశిర నియోజకవర్గంలోని కొంకల్లు, ఎం.రాయాపురం గ్రామాల్లో అతిసారం పూర్తిగా అదుపులోకి వచ్చిందని, అయినా మరో వారం రోజుల పాటు ఆ రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

పాఠశాలల తనిఖీ



సమస్యలపై కేజీబీవీ విద్యార్థులతో ఆరా తీస్తున్న మంత్రి సవితమ్మ

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ, కేజీబీవీను ఆదివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎంజేపీలో మరుగుదొడ్ల సమస్య ఉందని, కేజీబీవీలో ప్రహరీ ఎత్తు పెంచాలని ఈ సందర్భంగా ఆమెను విద్యార్థులు కోరారు. గత ప్రభుత్వంలో ఎంజేపీలో అర్ధంతరంగా ఆగిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో అక్రమంగా మద్యం, గంజాయి, నాటుసారా లాంటివి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత హెచ్చరించారు. ఆదివారం పుట్టపర్తిలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలసి ఆమె తనిఖీలు చేపట్టారు. కమ్మవారిపల్లి రోడ్డు ప్రశాంతి పెట్రోల్ బంక్ వద్ద కొత్తచెరువుకు చెందిన మెకానిక్ విజయభాస్కర్ నుంచి 6 గ్రాముల బరువున్న 20 ప్యాకెట్ల గంజాయి, మరో 710 గ్రాముల లూజు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ధర్మవరానికి చెందిన ఎరికల పెద్దన్న వద్ద నుంచి తాను కొనుగోలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



కఠిన చట్టాలతోనే దాడులకు అడ్డుకట్ట

కోల్‌కతా అత్యాచార ఘటన దారుణం. చట్టాలు బలహీనంగా ఉండడంతోనే వైద్యులపై తరచూ దాడులు జరుగుతున్నాయి. అత్యాచార దోషికి ఉరి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలి. రోగుల వెంట వచ్చే బంధువులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రోగి పరిస్థితి మేరకు అనుమతులు ఇవ్వాలి. విచ్చలవిడిగా సందర్శకులను అనుమతించకపోవడం మేలు. మద్యం సేవించి ఆస్పత్రులకు వచ్చేవారిని కట్టడి చేయాలి.

– టి.సుకన్య, స్టాఫ్ నర్సు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బత్తలపల్లి



రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటన దురదృష్టకరం. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు, ఆరోగ్య సిబ్బందికే రక్షణ లేకపోవడం బాధాకరం. రాత్రి పూట ఆస్పత్రుల్లో విధుల్లో ఉండే వైద్యులకు తప్పనిసరిగా రక్షణ కల్పించాలి. మహిళా ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ అలేఖ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, నల్లచెరువు



రైతుకు ఆదాయం.. ప్రజలకు ఆరోగ్యం



విరగ్గాసిన కొర్ర పంటను చూపుతున్న ఈ యువరైతు పేరు రఘునాథరెడ్డి. కదిరి మండలం కె.బత్తలపల్లి గ్రామం. డిప్లొమా పూర్తి చేసి, ప్రస్తుతం స్వగ్రామంలో సేంద్రియ పద్ధతిలో 2 ఎకరాల్లో కొర్ర సాగు చేశాడు. రూ.30 వేల వరకూ పెట్టుబడులు అయ్యాయి. ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున మొత్తం 24 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.5 వేల చొప్పున గ్రామానికే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేశారు. ఇలాంటి యువ రైతులు ఆ గ్రామంలో 38 మంది ఉన్నారు. వీరంతా మొత్తం 50 ఎకరాల్లో కొర్ర, అండు కొర్ర పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.



కె.బత్తలపల్లిలో రైతు కమలయ్య సాగు చేసిన కొర్ర పంట

- కొర్ర సాగుపై యువ రైతుల ఆసక్తి
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు
- ఒకే గ్రామంలో 50 ఎకరాల్లో కొర్రసాగు

కదిరి: జిల్లా రైతుల దృష్టి ప్రస్తుతం కదిరి పట్టణానికి 6 కి.మీ దూరంలో కె.బత్తలపల్లిపై పడింది. మొత్తం 859 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 44.7 శాతం మంది అక్షరాస్యులు ఉన్నారు. మొత్తం 217 ఇళ్లు, 784 హెక్టార్ల భూమి ఉంది. 59.7 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన యువ రైతులు దాదాపు సేంద్రియ వ్యవసాయ విధానాలు అనుసరిస్తూ చిరుధాన్యాల సాగు చేపట్టారు. ప్రధానంగా 50 ఎకరాల్లో కొర్ర, అండు కొర్ర పంటలను బిందు సేద్యం ద్వారా చేపట్టారు. వీటి సాగుకు తక్కువ ఖర్చు అవుతుందని, రైతులకు లాభంతో పాటు వీటిని ఆహారంగా తీసుకున్న వారికి మంచి ఆరోగ్యం కూడా ఉంటుందని వారంటున్నారు.

కొర్రలో పోషకాలెన్నో..

చిరు ధాన్యాల్లో కొర్రలకు చాలా ప్రత్యేక స్థానం ఉంది. మిగిలిన పంటలతో పోలిస్తే కొర్ర పంట కాల పరిమితి చాలా తక్కువ. మూడు, నాలుగు వర్షాలతో పంట చేతికొస్తుంది. బియ్యం, గోధుమల్లో కంటే వీటిలో పోషకాలు ఎక్కువ. 100 గ్రాముల కొర్రల్లో 12.3 గ్రాముల మాంసకృత్తులు, 8 గ్రాముల పీచు పదార్థం, 3.3 గ్రాముల ఖనిజ లవణాలు, 31 శాతం క్యాల్షియం, 2.8 మిల్లీ గ్రాముల ఐరన్ ఉంటుంది. ఇందులో ఉన్న పీచు పదార్థం చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి స్థూల కాయాన్ని తగ్గిస్తుంది. బీపీ, షుగర్, గుండె జబ్బులను నిరోధించడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు దివ్యమైన ఆహారం కొర్ర అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

30 రోజులు కాపాడుకుంటే చాలు

కొర్ర రకాలన్నీ దాదాపు 28–32 రోజుల్లో పూత దశకు వస్తాయి. ఆ సమయంలో పంట బెట్టకు లోను కాకుండా చూసుకోవాలి. గింజ పాలు పోసే దశను దాటి 58–62 రోజుల్లో పరిపక్వానికి వచ్చి కోతకు సిద్ధమవుతుంది. ఎకరాకు 3 కిలోల విత్తనం సరిపోతుంది. గొర్రు సాయంతో విత్తుకోవచ్చు. మధ్యస్థ, స్వల్ప కాలిక రకాలైన శ్రీలక్ష్మి, నరసింహరాయ, కృష్ణదేవరాయ, ఎస్ఐఏ 3085, ఎస్ఐఏ 316, సూర్యనంది రకాలు ప్రస్తుతం మార్కెట్‌లో రైతులకు అందుబాటులో ఉన్నాయి. అత్యల్ప కాలిక ఎస్ఐఏ 3222 కొర్ర రకం 28–32 రోజుల్లో పూతకు వచ్చి కేవలం 58–62 రోజుల్లో పక్వానికి వస్తుంది. ఇవన్నీ దాదాపు ఎకరాకు 10–12 క్వింటాళ్ల దిగుబడి నిస్తాయి. నల్లరేగడి నేలలు కొర్ర సాగుకు మంచి అనువైనవి. కొర్ర పంటకు పురుగులు, తెగుళ్ల బెడద తక్కువని రైతులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి చాలా మంచివి



మా ఊరి రైతులు సేంద్రియ పద్ధతిలో 50 ఎకరాల్లో కొర్రలు, అండు కొర్రలు సాగు చేస్తున్నారు. నేను 12 ఎకరాల్లో అండు కొర్ర వేశాను. ఎలాంటి ఎరువులూ వాడలేదు. పొలంలో అండు కొర్ర విత్తనం చల్లాను అంతే. పంట చేతికి వచ్చాక కర్ణాటకలోని మాలూరుకు చెందిన కొందరు వ్యాపారులు పొలం వద్దకే వచ్చి దిగుబడి కొనుగోలు చేసి వెళ్లారు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల దాకా లాభం వచ్చింది. కేవలం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చిరుధాన్యాలను మాత్రమే సాగు చేస్తున్నాం. మేము కూడా ఇవే తింటున్నాం. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి.

– ఓబుళరాయుడు, కె.బత్తలపల్లి

రైతులను చైతన్య పరుస్తున్నాం



ఆర్గానిక్ పద్ధతిలో చిరు ధాన్యాలు సాగు చేయాలని గ్రామాల్లోని రైతులను చైతన్య పరుస్తున్నాం. ముఖ్యంగా యువత బాగా ఆసక్తి చూపుతోంది. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు రావడంతో పాటు మిలెట్స్ ఆరోగ్యకరమని కూడా చెబుతున్నాం. కొర్ర ఇడ్లీ, కొర్ర అన్నం, కొర్ర సంగటి, కొర్ర పాయసం.. ఇలా ఎన్నో రకాలుగా వంటలు వండి రైతులకు తినిపిస్తుంటే వీటి సాగుకు ముందుకొస్తున్నారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా చిరు ధాన్యాల సాగు ఎంతో లాభదాయకంగా ఉంది. రైతులు సంఘంగా ఏర్పడి మిల్లెట్స్ సాగు చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు అందజేస్తుంది.

– చింతా శరత్‌కుమార్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు, కదిరి

వివాహిత ఆత్మహత్య



మృతురాలు అపర్ణ

ధర్మవరం రూరల్: మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన వివాహిత అపర్ణ(26) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... అపర్ణకు రొద్దం గ్రామానికి చెందిన సురేంద్రతో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కారు డ్రైవర్‌గా సురేంద్ర పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఆదివారం నొప్పి తీవ్రత భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతి దూలం లాగుతున్న వృషభాలు

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంటలో నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయ ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నిర్వహించిన వృషభాల బలప్రదర్శన హోరాహోరీగా సాగింది. వైఎస్సార్, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 8 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. వైఎస్సార్ జిల్లా చౌటపల్లికి రైతు మార్థల చంద్ర ఓబులరెడ్డి వృషభాలు 3 వేల అడుగుల దూరం రాతి దూలాన్ని లాగి మొదటిస్థానంలో నిలిచాయి. ఇదే రైతుకు చెందిన మరో జత వృషభాలు రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లికి రైతు నాగయ్య వృషభాలు మూడో స్థానం, గార్లదిన్నెకు చెందిన రైతు రామాంజనేయులు వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

పేలుడు పదార్థాల స్వాధీనం

కదిరి టౌన్: పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు. ముందస్తు సమాచారంతో ఆదివారం రాత్రి స్థానిక మున్సిపల్ పరిధిలోని బంగారు లక్ష్మణ్ కాలనీలో నివాసముంటున్న మల్లయ్య ఇంట్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఇంట్లో నిల్వ చేసిన పేలుడు పదార్థాలు, ఓ కంప్రెషర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మల్లయ్యతో పాటు డ్రైవర్ రమేష్ నాయక్, శ్రీనివాసులును అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో..

దేవానంద్ కాలనీలో నివాసముంటున్న షేక్‌సాదిక్... అతని మామ అల్లుడు అస్లాం ఇద్దరూ మంచి స్నేహితులు. అస్లాం కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో సాదిక్ జోక్యం చేసుకున్నాడు. దీంతో ఆగ్రహించిన అస్లాం కత్తితో సాదిక్‌పై దాడి చేశాడు. క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అస్లాంపై కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.


జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడా జట్లతో నిర్వాహకులు

అనంతపురం సెంట్రల్: త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళా, పురుషుల జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చేపట్టారు. మహిళా జట్టుకు గంగోత్రి (కణేకల్లు), వెంకటలక్ష్మి (విడపనకల్లు) సౌమ్య (ఖాదర్‌పేట), శివ కన్య (ధర్మవరం), నిఖిల (ప్రసన్నాయపల్లి), అనంతపురానికి చెందిన వైష్ణవి, హేమ, హరిత, స్టాండ్‌బైలుగా విడపనకల్లుకు చెందిన పి.అమృత, బి.అమృత, శ్రీలేఖ (ఖాదర్‌పేట) ఎంపికయ్యారు. అలాగే పురుషుల జట్టులో వెంకటేశులు (బండమీదపల్లి), నారాయణస్వామి (మల్లాపురం), మహబూబ్‌బాషా (ముదిగుబ్బ), అశోక్ (కనగానపల్లి), శ్రీనాథ్ (ఇసురాళ్లపల్లి), సునీల్(ఇసురాళ్లపల్లి), అనిల్ (నారాయణపురం), బాలాజీ (వెంకటగిరిపాలెం), గోవర్ధన్ (ధర్మవరం), పురుషోత్తం (పెద్దకోట్ల), స్టాండ్ బైలుగా ధనుంజయ (మర్తాడు), రవి(బండమీదపల్లి), హరీష్(అనంతపురం), అశోక్ (కిష్టిపాడు) చోటు దక్కించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ కమిటీ కన్వీనర్ ఈశ్వరయ్య, అధ్యక్ష, కార్యదర్శులు గౌస్ మొహిద్దీన్, ఎస్.వెంకటేసులు అభినందించారు.

రేపటి నుంచి బీబీ జైనబ్బీ దర్గా ఉత్సవాలు



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న బీబీ జైనబ్బీ దర్గా

ఉరవకొండ: భక్తుల కొంగుబంగారంగా పాక్‌దామన్ హజరత్ సయ్యదున్నిసా బీబీ జైనబ్బీ అమ్మవారు విరాజిల్లుతున్నారు. ఉరవకొండలోని బీబీ జైనబ్బీ దర్గాను సంతానం లేని జంటలు, పెళ్లి కానీ యువతీ, యువకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుంటే సంతాన ప్రాప్తితో పాటు కల్యాణం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. దర్గాలో అపురూప శిల్పకళ ఆకట్టుకుంటుంది. అరబ్ దేశంలోని పవిత్ర మక్కా ప్రాంతంలో ఏర్పాటు చేసిన జన్నత్‌కా దర్వాజ (స్వర్గద్వారం)ను పోలిన కట్టడాన్ని కర్ణాటక కళాకారులతో ఇక్కడ ఏర్పాటు చేశారు. గుల్బర్గా ఖాజా బందే నవాజ్ దర్గా తరహాలో ఇక్కడ గాజు గోపురాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. అజ్మీర్‌లో ప్రసిద్ధిగాంచిన ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గా తరహాలో భారీ దేగ్‌ను దర్గాలో ఏర్పాటు చేశారు. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో అమ్మవారి దర్గా ఆకర్షిస్తుంది.

ఈ నెల 28 నుంచి ఉరుసు ఉత్సవాలు..

బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు ఈ నెల 28న ప్రారంభమవుతాయని దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా తెలిపారు. 28న అమ్మవారి గంధం వేడుకలు, 29న ఉరుసు, 30న జియారత్ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఖవ్వాలీ పోటీదారుడు రైస్ అనీస్‌శబరి ఈ నెల 30న జరిగే ఖవ్వాలీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'అనంత'



ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. ఈ పోటీలు విజయవాడ శివారులోని కానూరు అనుమోలు ప్రభాకరరావు మైదానంలో ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో 23 జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో 5–0 తేడాతో కృష్ణా జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. మొదటి మూడు స్థానాలు దక్కించుకున్న జట్లలోని క్రీడాకారులకు పతకాలను నిర్వాహకులు అందజేశారు. విజేత జట్టు క్రీడాకారులు, కోచ్‌లు ఆనంద్, మారుతీని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్ అభినందించారు.

'అపూర్వ' సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కూడేరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సందడి నెలకొంది. 1991–92లో 10వ తరగతి చదివిన విద్యార్థులు 32 ఏళ్ల తర్వాత అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో మొదలైన ఈ కార్యక్రమంలో ఎంతో కోలాహలంగా సాగింది. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి ఉపాధ్యాయులు దస్తగిరి, అంజినరెడ్డిని ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తాము ఏయే రంగాల్లో స్థిరపడ్డారు. వారి కుటుంబాల పరిస్థితిని వివరించారు. భోజనాల అనంతరం ఆటపాటలతో సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.

పర్తిలో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న రత్నాకర్‌రాజు దంపతులు



విశాఖ భక్తుల కోలాటం

పుట్టపర్తి రూరల్: సత్యసాయి సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం సంబరంగా సాగాయి. పర్తి యాత్ర పేరుతో విశాఖపట్నం జిల్లాకు చెందిన 2,500 మంది భక్తులు పుట్టపర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హనుమాన్ సర్కిల్ వద్ద కృష్ణాష్టమి వేడుకలను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు దంపతులు ప్రారంభించారు. శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టే వేడుక కోలాహలంగా సాగింది.

ఐటీఐలో రేపు జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ ప్రిన్సిపాల్ రామమూర్తి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సమీపంలోని అమర్‌రాజా ఎనర్జీ మొబిలిటి లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయనున్నారు. ఐటీఐ పూర్తి చేసిన వారితో పాటు చివరి సంవత్సరం పరీక్షలు రాయబోతున్న విద్యార్థులూ అర్హులు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతితో పాటు నెలకు రూ.14 వేలు వేతనం చెల్లిస్తారు. పూర్తి వివరాలకు 88868 85173లో సంప్రదించవచ్చు.

ప్రత్యామ్నాయం చూపని సర్కారు

- విస్తారంగా వర్షాలు కురిసినా విత్తు ఇవ్వని చంద్రబాబు ప్రభుత్వం
- కాగితాలకే పరిమితమైన 46,172 క్వింటాళ్ల విత్తనాలు



ఉలవ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు ప్రత్యామ్నాయం చూపించకుండా చంద్రబాబు సర్కారు కాలం వెళ్లదీస్తోంది. 50 రోజుల తీవ్ర వర్షాభావ పరిస్థితుల తర్వాత ఎట్టకేలకు ఇటీవల ఉమ్మడి జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిసాయి. అయినా ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రశ్నార్థకమైంది.

ప్రతిపాదనలకే పరిమితం..

జూన్ 14 తర్వాత వర్షాలు లేక ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన పంటల సాగు పూర్తిగా తగ్గింది. వేసిన విత్తన పరిస్థితి కూడా అంతంతమాత్రంగా ఉన్న రెండు నెలల తర్వాత ఈ నెల 14 నుంచి మంచి వర్షాలు నమోదయ్యాయి. ఈ క్రమంలో కనీసం ప్రత్యామ్నాయం కింద పంటలు సాగు చేద్దామనుకుంటే చేతిలో విత్తనం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 80 శాతం రాయితీతో అనంతపురం జిల్లాకు 27,907 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 18,265 క్వింటాళ్ల మేర ఉలవలు, పెసలు, అలసందలు, కొర్రలు, జొన్నలు, మినుము విత్తనాలకు చేసిన ప్రతిపాదనలకు దిక్కుమొక్కు లేదు.

మంత్రి ప్రకటించినా...:

ఈ నెల 21న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అతి త్వరలోనే ప్రత్యామ్నాయ విత్తనం అందిస్తామని గొప్పగా ప్రకటించారు. అయితే విత్తనాల పూర్తీ ధరలు, ఇతర నిబంధనలు, పంపిణీ మార్గదర్శకాలు, విత్తన సేకరణ, సరఫరా పరిస్థితి ఇంకా తేలకపోవడం విశేషం. అనంతపురం జిల్లాలో 3.46 లక్షల హెక్టార్లకు గానూ 62 శాతం విస్తీర్ణంతో 2.15 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయగా... ఇంకా ప్రత్యామ్నాయం కింద 1.31 లక్షల హెక్టార్లు అంచనా వేశారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో కూడా 2.89 లక్షల హెక్టార్లకు గానూ 52 శాతంతో 1.60 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రాగా ప్రత్యామ్నాయం కింద 1.29 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. కానీ విత్తనం ఇవ్వడంలో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తుండగా వ్యవసాయశాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విత్తన పంపిణీ మరింత జాప్యం చేస్తే భూమిలో తేమ ఆరిపోతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

సర్కారు సాయం నిల్..

గత ఐదేళ్లు జూన్, జూలై మాసాల్లోనే రైతు భరోసా కింద పెట్టుబడిసాయం, ఉచిత పంటల బీమా కింద పెద్ద మొత్తంలో పరిహారాన్ని అప్పటి జగన్ సర్కార్ అందజేసింది. 'అంతకు మించి' అంటూ ఆశలు రేకెత్తించి రైతుల ఓట్లు కొల్లగొట్టిన చంద్రబాబునాయుడు తీరా అధికారం చేపట్టిన తర్వాత రైతాంగంపై చిన్నచూపు చూస్తుండటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు గురించి ఇప్పటి వరకూ చంద్రబాబు సర్కార్ స్పష్టత ఇవ్వలేదు. అలాగే ఉచిత బీమా కింద పరిహారం కూడా ఇవ్వకుండా దగా చేయడంతో అన్నదాతలు భగ్గుమంటున్నారు.